# వామదేవమహర్షి

శ్రీ ఎస్. లక్ష్మణయ్య

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 6

# వామదేవమహర్షి


రచన

శ్రీ సముద్రాల లక్ష్మణయ్య

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



ప్రచురణ

డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 6

**VAMADEVAMAHARSHI**

by

***Sri Samudrala Lakshmanaiah***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

Printed at
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens
Tirupati ✆ : 30184

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -


**ఈ వేద కథా భారతి.**

వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ



# మనవి


వేద కథాభారతి.

అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999 ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# వామదేవమహర్షి

సనాతనధర్మానికి మూలకందమైనవి వేదాలు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం - అని నాలుగు భాగాలుగా వింగడింపబడిన వేదరాశి విశ్వానికి చేసిన సేవ అనంతం. మానవజాతి ఆలోచనా స్రవంతిని, ప్రవర్తనను, ప్రవిమలతను అది ప్రభావితం చేసింది. భారతావనిలో నైతిక, సామాజిక, ధార్మికజీవనసంవిధానానికి ఊపిరి పోసింది. అనంతకోటి జీవరాసులమధ్య పరస్పరావగాహనకు మార్గదర్శక మయింది. ధర్మబద్ధంగా అర్థ కామాలను సముపార్జించుకొంటూ, సంతుష్టిగా, సంతృప్తిగా అనుభవంలోకి తెచ్చుకొంటూ - మానవాళి నిశ్చలమైన మనసుతో, అచంచలమైన విశ్వాసంతో, సుదృఢమైన సంకల్పంతో పరమపురుషార్థమైన ముక్తివైపు తరలిపోవటానికి సంసిద్ధులనుచేసింది.

**అతిప్రాచీనమైన నాల్గోమండలం :**

ఋగ్వేదం నాలుగు వేదాలలో తలమానికం. అది మిగతా మూడు వేదాలలోని ఎన్నో అంశాలకు బీజప్రాయం. అందలి నాల్గవ మండలం అత్యంత రమణీయమైనది. ఎన్నో అద్భుత రహస్యాలను మౌలిక విశేషాలను, తాపత్రయ నివారణోపాయాలను, తామసహరణ సూక్ష్మాలను విశ్వానికి విశదంచేసింది. కరతలామలకాలుగా, కరదీపికలుగా దివ్యజీవనరీతుల్ని మానవాళికి సన్నిహితం గావించింది.

అతి ప్రాచీనమైన ఒకటి, రెండు ఋగ్వేద మండలాల్లో నాల్గవ మండలం ఒకటి. వాచికంగా, అరుదుగా సంప్రదాయబద్ధంగా, సంకేత రూపంగా, పరోక్షంగా వ్యక్తులను పరిచయం చేయటం వేదవాఙ్మయ వాక్సరళి. ఆరచనాసౌందర్యమే వేదప్రశస్తిని, ప్రవిమలతను, పారదర్శకతను

పదిలపరచింది. అపౌరుషేయమైనా, పౌరుషేయమని అంగీకరించినా, పట్టు సడలని వేదహృదయదీప్తి, విరాట్ స్వరూప విశ్వరూపావిష్కరణకు ఆలంబనంగా విరాజిల్లుతున్నది. దాని ప్రశస్తి మొక్కవోనిది.

**రెండూ ఒక్కటే!**

అందుకే విశ్వజనాళికి వేదనాదంపైన, వేదహృదయంపైన, వేదవాక్యంపైన, వేదవాదంపైన అనురక్తి, అనాదిగా, అనంతంగా, అజేయంగా, అజరామరంగా సాగుతున్నది. నిజానికి విశ్వానికీ, వేదానికీ అంతరంలేదు. రెండూ ఏకమే. ఆ సమగ్ర సమైక్యభావం సాటిలేనిది. ''ఆ కనుపించని తత్త్వమూ, గోచరించే ఈ విశ్వమూ రెండూ అనంతమే. ఆ గోచరముగాని అనంతంనుండి ఈ దృశ్యమానమైన అనంతవిశ్వం ఆవిష్కృతమైనది. ఈ అంతమెరుగని విశ్వసాకల్యం చర్మచక్షువులకు తోచని ఆ అనంతం నుండి వెలువరింపబడినా ఆ అనంతం అనంతంగానే ఉన్నది. ఈ పరిపూర్ణతకు లోపమే లేదు. ఆ సమగ్రత సర్వదా సంపూర్ణమే'' అన్న శాంతిపాఠం వేదహృదయం.

**పరులధనాన్ని ఆశించకు :**

'నిత్యమూ, సత్యమూ, నిత్య సత్యం కాని ఈ కనిపించే సృష్టిలోని పరివర్తన శీలమైన ప్రతిదీ భగవంతునిచే ఆవరింపబడినదే. భగవంతుని చైతన్యం వ్యాపించనిదేదీ లేదు. ఆ దివ్య చైతన్యత్యాగనిరతిని ఎఱుక జేసుకొని, దానితో తాదాత్మ్యం చెంది నీ జీవనాన్ని నియంత్రించుకో. అలా నిన్ను నీవు పోషించుకోవటంలో పరుల ధనాన్ని ఈషణ్మాత్రమైనా ఆశించకుము' అన్న ఈశావాస్యోపనిషత్ సందేశామృతవచనం వేదనాదం. సమగ్ర ఆత్మవాదం.

జీవుణ్ణి దేవునితో సమైక్యంజేసి, సృష్టివిలాసాన్ని మహోజ్జ్వలం గావించి, దివ్యజీవనాన్ని భూతలంపై నెఱపే వేదచతుష్టయంలో తొలిది

ఋగ్వేదం. అది కంటికి కనిపించే విశ్వసౌందర్యాన్ని అంతర్దృష్టితో అవలోకించి, పరిశీలించి, విశ్లేషించి, ఆ అందచందాలను అమర గీతికలుగా ఆలపించింది.

ఎవరీ వామదేవమహర్షి ?

ఈ వేదానికి మకుటాయమానమైన నాల్గవ మండలానికి రూప కల్పన చేసిన వాడు వామదేవమహర్షి.

ప్రత్యక్షంగా ఈ మండలంలో నామతః ఆయన ప్రసక్తి ఒక్కసారే చేయబడింది. వామదేవుడు తాను దర్శించిన సూక్తాలలో అన్యాపదేశంగా తనను గూర్చిన వివరాలు కొన్నింటిని పొందుపరచాడు. ఆ మండలంలోని కొన్ని సూక్తాలకు, ఋషులు దేవతలునైన మరికొందరు కూడా పరోక్షంగా ఆయనను గూర్చిన, ఆయన వంశమును గూర్చిన అంశాలను ప్రస్తావించారు. అయినా ఋగ్వేదంలోని నాల్గవమండలం ఆయనగూర్చి ఆయన వంశాన్ని గూర్చి అందించిన సమాచారం అత్యల్పమే. ఆయన జీవితం ఋగ్వేద చతుర్థమండలంవలెనే విలక్షణ మైనది. అందుకే పరిశోధకులు ఋగ్వేద చతుర్థ మండలాన్నే కాక, ఇతర సాహిత్యాన్ని కూడా సమగ్రంగా, సాకల్యంగా మథించి, విశ్లేషించి ఆ మహనీయుని జీవితవిశేషాలను లోకానికి పరిచయం చేశారు. వాటి ఆధారంగా ఆ క్రాంతదర్శి, ఆ చరాచర సుఖాభిలాషి, జీవిత రేఖా చిత్రాన్ని అవలోకిద్దాం, కమలకందినంతగా, మనసు మలచినంతగా. ఆ జీవన్ముక్తుని జీవనవిధానాన్ని, జీవధర్మాన్ని ఆయన వెలువరించిన సృష్టివిలాసాన్ని స్థాలీపులాకన్యాయంగా పరిశీలిద్దాం.

ఆయనే ఒకచోట తన వేదసూక్తంలో తాను గౌతముని పుత్రుడవని స్వయంగా ప్రకటించుకొన్నాడు. ఆయన వంశవృక్షాన్ని పలువురు పలువిధాలుగా చిత్రించారు. ఈ విశ్లేషణలన్నింటినీ

పరిశీలించగా ఈ క్రింది వంశవృక్ష వివరాలు రూఢి చేయటానికి అతిచేరువలో ఉన్నాయి. వాస్తవానికీ, సహజవంశ వర్గీకరణవిధానానికీ, వాదానికీ నిలుస్తూ అవి హేతుబద్ధతను సంతరించుకొన్నాయి.

**అతడొక జీవన్ముక్తుడు!**

ఆంగీరసవంశానికి చెందిన గౌతముడు వామదేవుని జనకుడు. అతడు రహూగణుని పుత్రుడు. వామదేవుడు కాక గౌతమునకు నోధాసుడను మరొక పుత్రుడున్నాడు. గౌతముడు ఋగ్వేదంలోని I.74-93, IX.31,67 మరియు X.23. భాగాలకు ఋషి అని సంప్రదాయజ్ఞులు చెపుతారు.

గౌతముడు ఆరోగ్యాన్ని ప్రసాదించే అశ్వినుల ప్రగాఢ ఆరాధకుడు, విశ్వసనీయుమైన ఆశ్రితుడు. సంజ్ఞాదేవికీ, అశ్వరూపధారియైన సూర్యునకునూ ఉత్తరకురుదేశమునబుట్టిన నాసత్యుడు, దస్యుడు అను వారలే దేవతలకు వైద్యులైన అశ్వినులు. అట్టి సూర్యతేజఃసంపన్నులు, కాలమును నడిపించు కాలవేదులు, అంధులకు అంధత్వమును బాపి చూపుగల్పించు ఆధ్యాత్మిక జ్ఞాననిధులు నైన అశ్వినులనారాధించి శరణాగతిబొంది, వారి ఆశీర్వచనాలందుకొని పవిత్రుడైనగౌతముడు లోకకళ్యాణం గూర్చు సంకల్పదీక్షతో జీవితమును జీవన్ముక్తునివలె గడపినాడు. అతని పుత్రుడైన వామదేవుడునూ అశ్వినీ దేవతలగొల్చి వారి ప్రసాదం పొందినవాడే. తన పోషకుల శ్రేయస్సుకై ఆయన అశ్వనీదేవతలను ప్రార్థించాడు. ఆయన నిజమైన రక్షక ఋషి. గౌతముడు విదేహమాధవుని సమకాలికుడు. తూర్పు భారతావనిలో ఆర్యుల వలసరాజ్యస్థాపన కథాక్రమం పరికిస్తే గౌతముడు తూర్పు భారతావనికి తరలినట్లు సాక్ష్యాధారాలు కనిపిస్తాయి. గౌతముని ఆశ్రమం కోసలరాజ్యంలోని 'సదానీరా' నదీతీరంలో ఉన్నట్లు తోస్తుంది.

ఋగ్వేదంలోని నాల్గవ మండలంలో సరయూనది ప్రస్తావన ఉందికూడా.

ఋగ్వేదం మఱియు సర్వానుక్రమణికననుసరించి రూఢి చేయగల గౌతమ వామదేవుల వంశవృక్షం పరికిద్దాం.

ఆంగీరసుడు
|
రహూగణుడు
|
గౌతముడు
|
నోధాసుడు  వామదేవుడు
|
ఏకాధ్యుడు  బృహదుక్తుడు  మీరుధన్వుడు  అమహోముఖుడు

గౌతమవంశం వారి ప్రవరలను పరికించి పరిశీలిద్దాం.

| వంశం | ప్రవర - ఋషులు |
|---|---|
| 1) గౌతమ : | ఆంగీరసుడు ఆయాస్యుడు గౌతముడు. |
| 2) ఉచథ్య : | ఆంగీరసుడు ఉచథ్యుడు గౌతముడు. |
| 3) రహూగణ : | ఆంగీరసుడు రహూగణుడు గౌతముడు. |
| 4) సోమరాజ : | ఆంగీరసుడు సోమరాజు గౌతముడు. |
| 5) వామదేవ : | ఆంగీరసుడు వామదేవుడు గౌతముడు. |
| 6) బృహదుక్త : | ఆంగీరసుడు బృహదుక్తుడు గౌతముడు. |

ఋగ్వేద సప్తఋషుల నామావళిలో గౌతమరహూగణుని నామధేయమున్నదే గాని వామదేవుని పేరు చోటుచేసుకొనలేదు. దీనిని బట్టి గౌతముని వంశంలో ప్రముఖమైన చోటు వామదేవునికి తరువాతనే లభించినట్లు విశదమవుతున్నది. గౌతమ వామదేవ వంశజులు ఋగ్వేద చతుర్థమండలంలోని వివిధ భాగాలకేకాక మరికొన్ని మండలాలలోని మంత్రాలకుకూడ ద్రష్టలు. వారు ఋషులుగా, దేవతలుగా వున్నవేద

మండలాలు ఆవంశ ప్రముఖస్థానాన్ని చాటుతున్నాయి. వామదేవుని జనన వివరాలు, ఇతర విషయాలు వివరించటానికి మునుముందుగా గౌతమవంశజులు ఋగ్వేదమండలాల కర్తృత్వం వహించిన వివరాలపై ఒకింతగా విహంగావలోకనం చేద్దాం.

1) రహూగణ అంగీరసుడు:- గౌతముని తండ్రియైన ఇతడు తొమ్మిదో మండలంలో 37,38 సూక్తాలను దర్శించాడు.

2) గౌతముడు:- ఇతడు రహూగణుని పుత్రుడు. ఋగ్వేదంలోని I.74-93; IX 31, 67. 7-9 X .137-3. 1.78లో గౌతముల పేర్లు తరచుగా పేర్కొనబడ్డాయి. ఆ సూక్తంలోని ఐదవ పద్యంలో గౌతముడు తన అనుయాయులను ''రహూగణీయులుగా'' పేర్కొన్నాడు. దీనినిబట్టి రహూగణుడు గౌతమవంశీకులలో చాలా ప్రాచీనుడని తెలుస్తున్నది. అతడు విదేహమాధవుని పురోహితుడు.

3) నోధసుడు ఇతడు 1.58-64 మంత్రాలకు ఋషి. ఇతడు గౌతముని కుమారుడు. పలుచోట్ల ఇతని పేరు ప్రస్తావించబడింది. ఆయన తన అనుచరులను ''గౌతమాస్యులు'' గా పేర్కొన్నాడు. అది ఆయనకు గౌతముని కుటుంబంతో గల బాంధవ్యాన్ని సూచిస్తున్నది.

4) ఏకాద్యుడు. నోధసుని పుత్రుడైన ఇతడు VIII 69 సూక్తానికి ద్రష్ట ఇతనిపేరు VII. 69. లో ఒకసారి ప్రస్తావించబడినది.

5) వామదేవుడు : పూర్తిగా ఋగ్వేద చతుర్థమండల ద్రష్టత్వం వామదేవునిదేనని కొందరు చెపుతారు. అనుక్రమణికనుసరించి ఇతడు గౌతముని పుత్రుడు.

**విచిత్రమైన కోరిక :**

గౌతమపుత్రుడైన వామదేవుని జననకథ విలక్షణమైనది. ఆయన గర్భస్థపిండంగా ఉన్న దశలోనే జ్ఞానసంపన్నుడు. ఆత్మజ్ఞాన సంపన్నుడైన

అతనికి సహజరీతిలో తల్లి గర్భంనుండి కాక ఆమె పార్శ్వముల నుండి భువిపైన ఉద్భవించాలన్న ఆలోచన వచ్చింది. ఆ తల్లికి తన గర్భంలోని శిశువు యొక్క విపరీతపుటాలోచన ఎఱుకకాగానే, ఈ విరుద్ధ ప్రసవం నుండి తప్పించుకొనుటకై ఇంద్రుని తల్లియైన అదితిని మనసారా ప్రార్థించింది. ఆమె ఏకాగ్రతపస్సుకు మెచ్చిన అదితి ప్రసన్నయై ఇంద్రునితో కలసి వామదేవుని తల్లి నివసిస్తున్న అరణ్యానికి చేరుకొన్నది. జ్ఞాన సంపన్నుడైన గర్భస్థ వామదేవునితో చర్చించి అతనిని సహజ పద్ధతిలో తల్లి గర్భంనుండి బయలువెడలమని నచ్చజెప్పటానికి ప్రయత్నించింది. ఇంద్రుడు తల్లి గర్భంలో ఉన్న వామదేవునితో తల్లి గర్భం నుండి, అనాదిగా అందరూ అంగీకరించిన ప్రకృతి సహజమార్గం ద్వారా జన్మించమని, ప్రకృతి విరుద్ధంగా తల్లి పార్శ్వములు చీల్చుకొని రావాలనే సంకల్పాన్ని విరమించుకొమ్మనీ హితవు పలికాడు. ఆ హితవు గర్భస్థపిండంగా ఉన్న వామదేవునికి రుచించలేదు. పిండస్థ దశలోనే అతని ఎఱుకలో ఉన్న దివ్యజ్ఞానం ఇంద్రుని పలుకులను అంగీకరించేందుకు అడ్డుపడింది. ఇంద్రుని వాచాలత్వం అతనికి కర్ణకఠోరంగా గోచరించింది. ఆగ్రహం ముంచెత్తింది. కోపం ఆవహించినగర్భస్థపిండం మండిపడింది. హితవు చెప్పేదానికి నీ అర్హత ఏమని ఇంద్రుణ్ణి ప్రశ్నించింది. నీ జన్మవృత్తాంత మేమిటో తిరిగి చూసుకోమని ఎద్దేవాచేసింది? తల్లికే వైధవ్యం సంప్రాప్తింపజేసిన నీ తగవరితనమేమిటని నిలదీసింది? నీ చరిత్రేమిటో పరిశీలించుకొమ్మని హితం పలికింది? త్వష్టృ గృహంలో అన్యాయంగా, పొందవలసినదానికంటే ఎక్కువగా అమృతాన్ని హరించి, పానంచేసిన ఉదంతం గుర్తు చేసి, నీవంటి అపరాధికి, నాకు సలహాఇచ్చే పెద్దరిక మేపాటిదని ఆరాతీసింది. వృత్రాసుర వృత్తాంతాన్ని వెలికితీసింది. నీ పొగరు మోతుతనానికి నా సవాలు స్వీకరించి పోరాటానికి సిద్ధంకమ్మని ఆహ్వానించింది.

**నిజంగా ఇంద్రుడు గొప్పవాడే :**

అప్పుడు అదితి ఆ గర్భస్థ శిశువుతో సహజ గంభీర శైలితో, మాతృత్వ సహజానురక్తితో ఎలుగెత్తి తన పుత్రుడైన ఇంద్రుని సమర్థించింది. దేవతలలో అతనినిమించిన బలశాలి, యుద్ధ చతురుడు లేడని నిర్ధారించి చెప్పింది. దేవతలలో ఇంద్రుని సాటిలేని పరాక్రమాన్ని ప్రస్ఫుటపరచి ప్రశంసించింది. అతనినిగూర్చి వామదేవుడు ప్రశ్నించిన లొసుగులకు సహేతుకంగా సమాధానాలు చెప్పింది. కడుపులో ఉన్న ఉద్దండపిండం, జ్ఞానజ్యోతియైన వామదేవుణ్ణి శాంతపరచింది. అతనిలో ఇంద్రునిపై అనుకూల ప్రభావాన్ని పాదుకొల్పింది. వామదేవుడు ఇంద్రుని గొప్పతనాన్ని అంగీకరించేలా ప్రయత్నించి కృతకృత్యురాలయింది. నదులు ఇంద్రుని ఎలా కీర్తించాయి, వాటి హృదయంలో ఇంద్రునిపై గల భక్తి ప్రపత్తులెలాంటి వి అన్న విషయాలను విశదపరచింది. వృత్రాసురుని సంహరించినప్పటికీ ఆపాపము ఇంద్రుని కంటలేదనీ, ఎన్నిమలిన పదార్థాలు గంగలో దేలిననూ అవి గంగ పవిత్రతను చెరుపజాలనిరీతిగా, లోక హితార్థం ఆయా సందర్భోచితంగా ఇంద్రుడు చేసే కొన్ని కార్యాలు పాప సహితములుగా గోచరించినప్పటికీ అవి ఇంద్రుని పాపిని చేయజాలవనీ, అతని ప్రవిమలతకు మచ్చ గూర్చలేవని గ్రహించి తీర్థ రాజములు ఇంద్రుని శ్లాఘించిన రీతిని వామదేవుడు తల్లి గర్భంలోనే తీరుబడిగా విశ్లేషించుకొన్నాడు. ఆ గానమాధుర్యాన్ని అనుభవించాడు. ఆ అనుభూతులలోని సత్యాలను స్వీకరించాడు. వామ దేవకృతమైన ఋగ్వేద చతుర్థమండలంలోని పదునెనిమిదవ సూక్తం వామదేవుని కుటుంబసూక్తంగా పేర్కొంటారు. అందులో ఇంద్రునికీ, అదితికీ, వామ దేవునికీ మధ్య జరిగిన సంవాదరూపంలో ఇంద్రునికి, వామదేవునికి ఆయన కుటుంబం వారికి సంబంధించిన ఎన్నో విషయాలు వెలువరింప బడ్డాయి. రేఖామాత్రంగా ఆ విషయాలను తెలుసుకొందాం.

1) త్వష్ట ఇంద్రుని పుట్టుకను ఆపటానికి ప్రయత్నిస్తాడు.

2) ఇంద్రుడు తల్లిగర్భమార్గంనుంచి కాక పార్శ్వములనుండి విరుద్ధరీతిలో జన్మించాలన్న సంకల్పాన్ని చెపుతాడు.

3) ఇంద్రుడు సంప్రదాయాన్ని మన్నించి ఆప్రసవరీతిని అనుసరించి నందుకు అదితి అభినందించింది.

4) వామదేవుడు, అతిగా సోమపానం చేసినందుకు, దీర్ఘకాలం తల్లి గర్భంలో ఉన్నందుకు ఇంద్రుని నిందిస్తాడు. అదితి ఇంద్రుని అప్రతిహత సమరప్రావీణ్యాన్ని ప్రశంసించింది.

5) ఇంద్రుడు పాపపరిపూర్ణ శిశువని వామదేవుడు నిందిస్తాడు. అదితి ఇంద్రుడు భువిని దివిని ఆక్రమించిన విషయాన్ని విశదపరచి అతని వ్యాపకతను ప్రశంసించింది.

6) నదులు విలపిస్తున్నాయనీ, అది ఇంద్రుని అకృత్యఫలితమేనని చెపుతాడు వామదేవుడు. అదితి ఆ విషయాన్ని ఖండించి నదులు ఇంద్రుని స్తుతిస్తున్న వైనాన్ని ఎఱుకజేసింది.

7) వృత్రాసురసంహారంద్వారా ఇంద్రుడు మూటగట్టుకొన్న బ్రహ్మహత్యా పాతకాన్ని ప్రస్తావిస్తాడు వామదేవుడు. తమ నురగలతో నదులాపాపాన్ని ప్రక్షాళన గావించగలవని అదితి వక్కాణించింది.

8) వామదేవుడు, ఇంద్రుని గుటుక్కున మింగెయ్యాలని ప్రయత్నించిన దుష్టరాక్షసుని ఉదంతాన్ని ఉట్టంకించాడు. జలాలు ఇంద్రునికి సాయపడి ఆ దుష్టరాక్షసుని దునుమాడడానికి దోహదం చేశాయని అదితి వివరించింది.

9) వ్యంశుడు ఇంద్రునిపై దండెత్తిన విషయాన్ని ప్రస్తావించాడు వామదేవుడు. వ్యంశుని తలను ఇంద్రుడు నరికివేసిన వైనం వివరించింది అదితి.

10) గోమాత బలశాలియైన వృషభానికి జన్మనిచ్చుచందాన తాను మహత్తర బలపరాక్రమాలు గలిగిన ఇంద్రునికి జన్మనిచ్చి తన మాతృత్వానికి ఎనలేని కీర్తినీ, శాశ్వత ప్రశస్తినీ కల్పించుకొని ఎంతో సంతృప్తిని పొందానని, తాను ధన్యజీవినని సంబరపడుతూ చెప్పింది అదితి.

11) ఇతర దేవతలు ఇంద్రుని ఎలా మోసగించి, ఏకాకిని చెయ్యటానికీ, విశ్వాస ద్రోహానికి పాల్పడుతున్నారో అతనికి సవివరంగా విశదపరచి, జయం పొందటానికి, ఇంద్రుడు విష్ణుని సాయాన్ని కోరేలా అతడిని ఆమె ఆయత్తపరచింది.

12) కొంత ప్రశాంత చిత్తుడైన వామదేవుడు మీ తల్లిగారికి వైధవ్యం ప్రాప్తించటానికి ఎవరెవరు కారకులో, వారలా చేయటానికిగల కారణాలేమిటో సవివరంగా తెలియజేయమని ఇంద్రుణ్ణే కోరాడు. దానితోపాటు ఇంద్రుణ్ని చంపటానికి ప్రయత్నించిన వారెవరో, వారలా చేయతలపెట్టటానికిగల కారణాలేమిటోగూడా విపులీకరించమన్నాడు. అంతేకాకుండా ఇంద్రుడు విజయుడై, కష్టాలనుండి గట్టెక్కడానికి సహాయపడిన దేవతల వివరాలు కూడా ఎఱుకజేయమన్నాడు. ఇంద్రునిపై ద్వేషభావం లోలోపల ఉన్న వామదేవుడు, అదితి, ఇంద్రులతో జరిగిన సంవాదంద్వారా సానుకూలతను పెంచుకోవటానికి నాంది ప్రస్తావన జరిగినవైనం ఈ ప్రశ్నలలో ప్రస్ఫుటమవుతుంది. తొలుత క్రొత్తగా ఆవిర్భవిస్తున్న ఇంద్రారాధనావ్యవస్థకు విముఖులైనా రాను రాను వామదేవకుటుంబానికి చెందినవారు ఇంద్రారాధకులయ్యారు. ఇంద్రుని ప్రత్యక్షస్తుతులద్వారా, కొన్నిసందర్భాలలో నిందాస్తుతి మార్గాన్ని చేపట్టి స్తుతించారు.

13) ఇంద్రుడు వామదేవుని ప్రశ్నలకు సావధానంగా ప్రత్యుత్తర మిచ్చాడు. తాను అత్యంత కష్టదశలో ఉన్నప్పుడు సేనుడు తనకు సోమాన్ని తెచ్చిఇచ్చిన విషయం వివరించాడు.

**అద్వైతహృదయం :**

గౌతముడు, అతని పుత్రుడు వామదేవుడూ ప్రగాఢమైన ఇంద్రారాధకులు. వారికి ఇంద్రుని విజయయాత్రలన్నింటిలో సన్నిహిత సంబంధాలున్నాయి. వారు ఇంద్రుని ఆశ్రయించటం ఆరాధించటం, వారి ఆధ్యాత్మిక జ్ఞానవైశిష్ట్యానికి వన్నెలుదొడిగింది. ఆగర్భ ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నుడూ, లోకములు, లోకేశులు, లోకస్థులు, తెగిన తుదిన అలోకంబగు పెంజీకటి కవ్వల నెవ్వడు ఏకాకృతితో వెలుగునో వాని హృదయ జ్యోతిని సంతరించుకొన్నవాడు వామదేవుడు. సృష్టి అంతా భగవన్మయమేయనీ, దివ్యచైతన్యేతరమేదీ లేదని సమసిద్ధాంతాన్ని, అద్వైత తత్త్వహృదయాన్ని ఆకళింపు చేసుకొన్నవాడు. కనుకనే వామదేవుడు ''నేను మనువును, నేను సూర్యుడను, అతిప్రాచీనుడను, ఆద్యంత రహితుడను, అనాదినిధనుడను సకలమును నేనే, సర్వవ్యాపకుడను నేనే, సృష్టి సాకల్యము నేనే, దాని బాహ్యాభ్యంతరములు నేనే. దాని బాగోగులు నావి, నావి, నా వే'' నని విశుద్ధాత్మస్వరూపాన్ని తనకాపాదించుకొన్నాడు. సత్యాన్ని ప్రవచించాడు. నేను దివ్య గానం చేసిన మహామునిి కక్షీవంతుడను, అర్జునకుమారుడైన కుత్సుడను, పండితుడైన ఉశనుడను అని చాటుకొన్నాడు. దేవతలు నా ఇచ్ఛానుసారం నడచుకొంటారు. భీభత్సానలం సృష్టించే మహోద్ధత సాగరాలను నేను శాసించగలనని భగవచ్ఛక్తితో తన తాదాత్మ్యాన్ని చాటి చెప్పినాడు. నేను సోమపానోన్మత్తచిత్తుడనై శంబరుని తొంబదితొమ్మిది కోటలను ధ్వంసము గావించినాను. నూఱవ ఆవాసాన్ని గూడ దివోదాస అతిథిగ్వునికి సాయపడే సమయంలో నాశనం గావించాను. అని తనను

తాను అన్యాపదేశంగా పరిచయం గావించుకొన్నాడు తాను కర్తృత్వం వహించిన వేదసూక్తంలో. నిరాకార నిర్వికార నిర్గుణ పరబ్రహ్మ స్వరూపమొక్కటే సృష్టికి ముందుండేది. ఆ అనాది బ్రహ్మము, అమూల బ్రహ్మం తనను తాను తెలుసుకొన్నది, సర్వాన్నీ తెలుసుకొన్నది. ఆ బ్రహ్మం తనను తానెరిగి, సకలాన్ని తానెరిగి సర్వము తానేనని, తానుకానిదేదీ లేదని తరచి తరచి తత్త్వమెరిగి, నిశ్చలమై, నిర్మలమై, నిత్యమై, సత్యమై పరగిన విధానాన్ని వరుసగా మునులు, దేవతలు మరియు మనుజులు కూడా అనుసరించారు.

అహంబ్రహ్మాస్మి :

'నేనెవరని' అన్వేషించి, తాను ప్రజ్ఞానమని, ప్రజ్ఞానము బ్రహ్మయని, బ్రహ్మమే తానని, తానే బ్రహ్మనని సాధించి తాము దైవ చైతన్యంతో తాదాత్మ్యం చెందటంలో సాధనద్వారా క్రమ క్రమంగా సఫలీ కృత మనోరథులవుతున్నారు. అగోచర పరబ్రహ్మము సకలము తానుగా గోచరమైన సృష్టి పరిణామ ప్రక్రియలో తమనిజతత్త్వం తెలుసుకోవటానికి విశ్వమందలి సమస్త జీవులూ ఆయత్తమవుతున్నారు. ఆ మౌలిక నిత్య సత్యమే ''నేను మనువును, సూర్యుడను'' అని వామదేవుడు ప్రవచించిన తత్త్వహృదయం.

రక్షోఘ్నసూక్త మహిమ :

ఋగ్వేదం నాల్గవ మండలంలోని 'రక్షోఘ్నాగ్నిని స్తుతించే మంత్ర సూక్తాల కర్తగా పలువురు నిర్ధారించిన వామదేవుడు అత్యంత దుష్టురాలు, మోసగత్తె యయిన కుశిదాయిని, తన యజ్ఞములకు వివిధములైన అడ్డంకులు కలిగించి, బాధించినందుకు ప్రతిగా రక్షోఘ్నాగ్ని సూక్తాన్ని పఠించి ఆమెను హతమార్చి, తన యజ్ఞయాగక్రతువులకు ఆమె అడ్డంకిని తొలగించుకొన్నాడు. ఇది ఆయన తన కర్తృత్వంలో

రూపొందించిన రక్షోఘ్నాగ్నిసూక్తమహిమను తేటతెల్లంగావిస్తుంది. అంతేకాక ఆయన మంత్రసాధనానిరతికి ఉదాహరణగా కూడా నిలుస్తుంది.

ఒకరోజు రథాల పరుగుపందెంలో ఇతర రాక్షసులతో కలసి కుశిదాయిని వామదేవునితో తలపడుతుంది. ఆయన రథచక్రాలను, వివిధ తదితర భాగాలను భంగపరచి కాడిని ధ్వంసంచేసి, ఆయనకు క్లేశాన్ని కలిగిస్తుంది. రాక్షసుల దహనానికై వామదేవుడు రక్షోఘ్నాగ్నిసూక్తాన్ని గానం చేశాడు. ఆ మంత్రప్రభావం దావానలాన్ని సృష్టించింది. ఆ అనల జ్వాలల్లో రాక్షసులు మాడి మసి అయిపోయారు. ఆ మంటల తాపానికి తట్టుకోలేక వికృతంగా కేకలేస్తూ కుశిదాయిని పరువులెత్తి సమీపంలో ఉన్న తటాకంలో తలదాచుకుంటుంది. రాక్షసులంతా హతమారిపోయిన తరువాత వామదేవుడు అదే అగ్నిసూక్తాన్ని ప్రయోగించి ఆదుష్ట మనస్కురాలైన కుశిదాయిని తలను భస్మం గావించాడు. ఆమె లోక కంటకత్వానికి చరమగీతం పాడాడు. లోకకళ్యాణానికి తన వంతు సహకారాన్ని అందించినాడు. దుష్టులను నుగ్గుచేసే రక్షోఘ్నాగ్ని సూక్తద్రష్ట వామదేవుడు.

**అమోఘమైన అగ్నిస్వరూపం :**

లోకకళ్యాణమే వేదాల ఊపిరి. అగ్ని ప్రాణశక్తి. ప్రాణహితానికి, ప్రాణానుగత దుష్ట సంస్కారమూ అవశ్యమే. సంస్కారానికి కాల్చే అగ్ని అత్యంతావశ్యకం. వెలుగులీనే అగ్ని, వేడిని కలిగించే అగ్ని, వండివార్చటానికీ, సమూలంగా దహనం చెయ్యటానికీ కూడా అవసరం. అందుకే అగ్ని దేవుడు పరబ్రహ్మ స్వరూపుడు. సృష్టిస్థితిలయాలకధిపతి. సకల విశ్వచైతన్య వారాశి. వేదాలలో అందుకే అగ్ని సూక్తాలెన్నో ఉన్నాయి. ఋగ్వేదం విశ్వామిత్రుని పుత్రుడైన మధుచ్ఛందుని అగ్నిసూక్తంతో ప్రారంభమవుతుంది. దుష్టులను తునుమాడటం ద్వారా, వారికి

పాపవిముక్తి కలిగించే ప్రక్రియ అత్యంత ప్రవిమలమైన భగవంతుని దయావిష్కారమే. రాక్షసులను హతం చెయ్యటం ద్వారా వారి పాపానికి విముక్తి కలిగించి వారికి ముక్తి కలిగించేందుకు దోహదకారియైన రక్షోఘ్నాగ్ని సూక్తం పరమేశ్వరుని దయావిష్కారమే. దాని ద్రష్టయైన వామదేవుడు పరమేశ్వరానుగ్రహము పరిపూర్ణముగా పొందినవాడు. అతడు తాను తరించి ఎందరినో తరింపజేసిన, ప్రణవార్థస్వరూపమెరిగిన విమల చరితుడు. అతని చేతులలో భస్మీభూతయైన మంత్రగత్తె కుశిదాయి తల దాచుకొన్న తటాకం కాలక్రమంలో ''కౌశితాహ్రదం'' గా పిలువబడుతున్నది.

**పుత్రుణ్ణి ప్రసాదించండి :**

వామదేవుడు సహదేవుని పుత్రుడైన సోమకుని పురోహితుడు. సోమకుడు వామదేవునకు ఎర్రగోధుమరంగుగల అశ్వములు రెంటిని బహుమానంగా ఇచ్చాడు. ఈ సోమకుడు ఉత్తర పాంచాల వంశానికి చెందినవాడు. ఉత్తర పాంచాలవంశస్థులకు, వామదేవ, కుటుంబీకులకు మధ్య అత్యంత సన్నిహిత సత్సంబంధాలు నెలకొని ఉన్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. వామదేవుని కుమారుడైన బృహదుక్తుడు దుర్ముఖ పాంచాలునితో ఇంద్రమహాభిషేకాన్ని గూర్చి వినతి చేసినట్లు సమాచారం లభ్యమవుతున్నది. పురకుత్సునితోనూ వామదేవునకు సన్నిహిత సంబంధబాంధవ్యాలున్నట్లు సాక్ష్యాధారాలున్నవి.

వామదేవుని మాటలప్రకారం పురుకుత్సుని ఉదంతం చూద్దాం, సూచాయగా. పురుకుత్సుని ధర్మపత్నియైన పురుకుత్సాణి తన భర్త బంధింపబడినాడని, రాజ్యంలో అరాచకం కరాళనృత్యం గావిస్తున్నదనీ అవినీతి అక్రమాలు స్వైరవిహారం చేస్తున్నాయనీ, తమ రాజ్యానికి పెను ప్రమాదం పొంచియున్నదనీ గ్రహించింది. అక్కడికి

వచ్చిన సప్త ఋషులను తన వంశరక్షణకై, వారసత్వం కొనసాగింపునకు ఓ పుత్రుణ్ణి ప్రసాదించమని ప్రార్థించింది. వారు ఆమెను ఆమె సంకల్పసిద్ధికై ఇంద్రునకూ, వరుణునకూ ఆహుతులిమ్మని ఆదేశించారు. ఆమె ఇంద్రుణ్ణి, వరుణుణ్ణి ఏకాగ్రచిత్తంతో ప్రార్థించి, పూజించి సప్తఋషుల ఆదేశానుసారం సముచితమైనకార్యాలు, దానాలు, బలులు సమర్పించింది. సంతుష్టులైన ఇంద్రవరుణుల అనుగ్రహంతో పురుకుత్సుని ధర్మపత్ని జన్మనిచ్చిన పుత్రుడు తదుపరి కాలంలో త్రసదస్యునిగా ఖ్యాతినందినాడు.

వామదేవుడు, సోమకుడు తనకు బహుమతిగా నొసంగిన అత్యంత వేగంగా పరుగుదీసే రెండు గుఱ్ఱాలను ప్రాణప్రదంగా తన ఆశ్రమంలో వుంచుకొని పోషించాడు. ఆ గుఱ్ఱాల అమితవేగం దేశంలో బహుళ ప్రచారం పొందింది. ఆ కాలంలో అయోధ్యాధిపతి, ఇక్ష్వాకు వంశస్థుడైన శలుడు మృగాలను వేటాడుటలో అత్యంతం ప్రీతి గలవాడు.

ఇవ్వనుగాక ఇవ్వను :

ఒక నాడు వేటకు బోయి ఎన్నో మృగాలను తనరథముపై వెన్నాడి వేటాడాడు. ఒక మృగం మాత్రం శరవేగాన్ని మించిన వేగంతో పరుగెత్తి తప్పించుకొని పోయింది. ఆ మృగవేగంతో సమంగా పరుగుదీసి ఆ మెరుపు వేగపు మృగాన్ని సమీపించి వేటాడాలంటే వామ్యాశ్వాలుగా లోకప్రసిద్ధి గాంచిన వామదేవుని ఆశ్రమంలోని రెండశ్వాలను తెచ్చి రథానికి కట్టితేతప్ప మరేరీతిగానూ సాధ్యం కాదని రథసారథి ద్వారా శలుడు తెలుసుకొన్నాడు. అతడు వామదేవుని జేరి ప్రార్థించి తానామృగాన్ని వేటాడిన తరువాత ఆ గుర్రాలు రెండింటినీ తిరిగి అప్పగిస్తానని ప్రమాణం చేసి వామ్యాశ్వాలను తీసుకొని పోయాడు. ఎంతకాలం గడచినప్పటికి అధికారమదాంధుడైన ఆ నృపాలుడు జడధారి వామదేవుడు తన్నేమి జేయగలడన్న ఉదాసీనభావంతో ఉలకక మెలకక, అశ్వాలను తన వద్ద నే ఉంచుకొన్నాడు. నృపాలుని అనైతిక ప్రవర్తన వామదేవునికి

కోపంతెప్పించింది. తన శిష్యులను బంపి తిరిగి తన అశ్వాలను తన కప్పగించమని విన్నవించాడు. ఆ రాజుకా అభ్యర్థన రుచించలేదు. రాజుల అశ్వశాలలో నుండవలసిన మహాశ్వాలకు మున్యాశ్రమాల ఆవాసం సబబాయని హేళన జేసి, ఇవ్వనుగాక ఇవ్వనని తిరస్కరించాడు.

## నీ కొడుకే బలైపోతాడు :

ఇక లాభం లేదని గ్రహించిన వామదేవుడు తానే స్వయంగా రాజు వద్దకేగి తన అశ్వాలను తిరిగి తన కప్పగించవలసినదిగా ప్రార్థించాడు. కానీ కన్నుగానని ఆమహారాజు అతని మాటలను తృణీకరించాడు. అశ్వాల నివ్వలేదు సరిగదా ఆమునినే హతమార్చటానికి ప్రయత్నించాడు. అగ్ని తేజస్సంపన్నుడైన వామదేవుడు తన మహత్తర తపోమంత్ర శక్తులతో ఘోరాకారులైన రాక్షసులను సృష్టించాడు. శూలాదులను ధరించిన ఆ క్రూర రాక్షసులు శలునిపై బడి చీల్చి చెండాడారు. అతని మరణానంతరం అతని తమ్ముడు దలుడు సింహాసనమెక్కాడు. అతడూ వామదేవుని తురంగాలను తిరిగి వామదేవునకప్పగించలేదు. వామదేవుని శిష్యుడైన ఆత్రేయుడను వాడు వచ్చి అర్థించినప్పటికి స్వయంగా తానే వచ్చి వామదేవుడు ప్రార్థించినప్పటికీ లెక్కపెట్టక, పోగాలము దాపురించినవాడు అరుంధతిని, మిత్రుని వాక్యాన్ని, దీపనిర్వాణగంధాన్ని కనని వినని మూర్ఖుని రీతి, కుపితుడై ఎదిరి ప్రభావము దెలియక వామదేవుని హతమార్చుటకు విషదిగ్ధ సాయకాన్ని తీసుకురండని భటులను పురమాయించాడు. అప్పుడు వామదేవుడు ''రాజా! అది అంతః పురంలో ఉన్న నీ పుత్రుణ్ణే బలిగొంటుంది గాని నన్నేమీ చేయలేదని'' చెప్పాడు. అతని వాక్కు నిజమయింది. అంతఃపురంనుంచి విగతజీవుడైన దలుని కుమారుడు శ్యేనజిత్తుని కళేబరాన్ని దలుని వద్దకు ఆఖరి చూపులకై కొనితెచ్చారు.

**విప్రులను, ఋషులను వేధించకూడదు :**

సంయమనము లేక సత్యావగాహన గలుగక మరింత కోపావేశాలకు లోనై దలుడు వామదేవుని తుదముట్టించటానికి బాణాలు సంధించడానికి ఉపక్రమించాడు. వామదేవుని చూపుల వాడికి వేడికి దలుని చేతులు చైతన్యాన్ని కోల్పోయి శక్తిహీనములై పడిపోయాయి. అతని భార్య వినయంతో వామదేవుని ప్రార్థించింది. విప్రులనూ, ఋషులనూ వేధించకూడదని తానెంత జెప్పిననూ వినడనీ అతని వైపరీత్య భావాచరణలను సంస్కరించి సన్మార్గానికి మరల్చుమనీ పుత్రభిక్షబెట్టుమనీ వేయివిధాల వేడుకొన్నది.

అప్పటికి జ్ఞానోదయమైన దలుడు దర్పము వీడి పశ్చాత్తాపంతో వామదేవుని పాదాలపైబడి ప్రార్థించాడు. సజలనయనాలతో సన్నుతి గావించాడు. తన నిండు మనసు నవనీత సమానము గాన దారుణాఖండల శస్త్రతుల్యమనస్కుడైన నృపుని వామదేవుడు బేషరతుగ క్షమించాడు. కరుణతో, అతని హస్తాలకు తిరిగి చైతన్యం కల్పించాడు. అతని పుత్రుడు శ్యేనజిత్తుని బ్రదికించాడు. అతని అర్ధాంగిని ఆశీర్వదించాడు. ఇక్ష్వాకువంశాభివృద్ధికి తన ఆశీస్సులను అందజేశాడు. తన గుణ్డములను తాను గైకొని క్షేమముగ, తాను లోకకళ్యాణమును సాధించు ప్రయత్నం కొనసాగించటానికి తన ఆశ్రమమునకు మరలిపోయాడు. వామదేవుని శక్తి, సంకల్పదీప్తి, హృదయతేజోరక్తి, దయావిస్ఫారవైచిత్రి, లోకకళ్యాణ సంధాయక దీక్షాదక్షత అట్టివి.

**తనను తానెఱిగిన గొప్పజ్ఞాని:**

ఆ మహాత్ముడు భూమిపై పడకముందే అనన్య సామాన్యమైన దివ్యజ్ఞానాన్ని, అనంతాధ్యాత్మిక విద్యను తల్లి కడుపులోనే సంతరించుకొన్నాడు. దివ్యాత్మతత్త్వాన్ని సొంతం చేసుకొన్నాడు.

భూమాత హృదయమెరిగిన కృషీవల హృదయవిస్తృతిని తాను ద్రష్టయైన కృషీవలసూక్తంలో నిక్షిప్తంగావించి క్షేత్రపతి ఔదార్యాన్ని వ్యవసాయ ప్రాముఖ్యాన్ని వేదాంతరంగంతో తాదాత్మ్యం గావించాడు. ''నావాడు ఇంద్రుడు. పది క్షీరదాలనిస్తే అమ్మేస్తాను. ఆయన వృత్రాసురునిగెలువగానే ఆయన్ని కొన్నవారు ఆయనను నాకు తిరిగి ఇచ్చి వేయాలని'' ఇంద్రుడినే అమ్మజూపిన సాహసి - ఆ అమృత హృదయుడైన వామదేవుడు.'' నేను తల్లి గర్భంలో ఉన్నప్పుడే ఈ దేవతల తరతరాల వారసత్వ క్రమం గ్రహించాను. ఓ నూరు ఇనుపదుర్గాలు నాకు రక్షణ కవచంగా నిలిచాయి. వెంటనే డేగలా అత్యంత అనూహ్యవేగంతో తల్లిగర్భంనుండి తరలి వచ్చాను'' అని తన వేదసూక్తాలలో తనను గూర్చి చెప్పుకొన్నాడు. ఈ అనంత ఆత్మజ్ఞానాచార్యుడు, ఈ కాలవేది, ఈ వేదద్రష్ట పుట్టకముందే పరిమళించిన దివ్యతత్త్వ పుష్పం. దైవ ప్రసాదంగా సకల దేవతానుగ్రహంగా అనంతాత్మజ్ఞానవులవోకగా పొందిన ఆ మహాతేజస్వి, ఆ అమృతహృదయుడు ''వైశ్వానరుడు గోమాతలు ప్రసాదించే అమృత స్రవంతులను అత్యంతరహస్యంగా, ఎవ్వరూ దొంగిలించలేనంత గోప్యంగా దాచి ఉంచాడు అని విజ్ఞులమాట. మరిక నా మాటలకు మీ స్పందనేమిటని ప్రశ్నించాడు. ఆ పరిప్రశ్నకు అతడే సమాధానం. సమజ్ఞానస్వరూపసాక్షాత్కారం అతని సంవిధానం. ఇంద్రసముడనని తనను తానెరిగిన తత్త్వజ్ఞాని. ఆచరణ మరువని ఆచార్యవరుడు, వామదేవుడు. ఆతడు ప్రాతఃస్మరణీయుడైన ప్రాజ్ఞుడు. ఆ స్థితప్రజ్ఞుడు సర్వులకు సర్వకాల సర్వావస్థలలో నిత్య సత్య సంధాయకుడు, అనుసరణీయుడు, ఆత్మీయుడు. అందుకే అతని స్మరణే ఆత్మాను సంధానం, పరమాత్మ సన్నిధానం.

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

5-7-1999 To 8-7-1999